క్లుప్తంగా

బాధితులకు చేయూత



గోపీ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: మండలంలోని వేమవరానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకుంది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాల్మాన్‌పేటకు చెందిన పిక్కి గోపీకి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గోపీ పేదవాడు కావడంతో స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకుడు నేమాల శ్రీనివాసరావు, ఇతర సభ్యులు కలిసి రూ.30 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. ఇటీవల ఇదే గ్రామానికి చెందిన కందాల కాశీరావు బ్రెయిన్ స్ట్రోక్‌తో కాకినాడ న్యూరో ఆస్పత్రిలో వైద్యం పొందుతుండగా అతనికి రూ.35 వేలు అందించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి వెన్నుదన్నుగా నిలుస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మైలపల్లి అశోక్‌చక్రవర్తి, పోలవరపు రాజేష్, కందాల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

సచివాలయం తనిఖీ

కోటనందూరు: మండలంలోని కేఏ మల్లవరం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించి మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పంపన జయలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 16 లీటర్ల సారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో ఆరు లీటర్ల సారాతో కడతి శ్రీదేవి, కిర్లంపూడి మండలం రామచంద్రాపురంలో ఐదు లీటర్ల సారాతో గుత్తూరి శివ, సోమవరం గ్రామంలో ఐదు లీటర్ల సారాతో గుత్తుర్తి కృపానందంను అరెస్టు చేశామన్నారు. కిర్లంపూడి మండలం తామరాడలో ఐదు లీటర్ల సారాతో పరారైన కేత కొండమ్మపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో కాకినాడ టాస్క్‌ఫోర్స్ ఎస్సై జె.విజయ్‌కుమార్, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి టైమర్ మెషీన్ అందజేత

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్‌వీధిలో ఆంజనేయ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు టైమర్ మెషీన్ సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రమణకు భక్తులు టైమర్ మెషీన్ అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని అర్చకుడు రమణ కొనియాడారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 105 మంది ఎంపిక

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 13 కంపెనీలు పాల్గొన్నాయి. ఇంటర్వ్యూలకు 215 మంది హాజరు కాగా 105 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ ఒమ్మి రఘురాం, ప్రిన్సిపాల్ చంద్రనాయుడు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దండెం హరిశేషు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటా ప్రచారం

జగ్గంపేట: మండలంలోని రామవరంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జగ్గంపేట: మిచాంగ్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పలువురు రైతు కూలీ సంఘం నేతలు పాల్గొన్నారు.

నాడు అవస్థల మయం.. నేడు అభయం

- తుని పట్టణంలో జోరుగా అభివృద్ధి పనులు
- నాలుగున్నర ఏళ్లలో రూ.11.50 కోట్లతో 100 సీసీ రోడ్ల అభివృద్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తుని పురపాలక సంఘం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో పట్టణాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి వార్డులోనూ సీసీ రోడ్లు నిర్మించారు. గత ప్రభుత్వంలో అధ్వానంగా ఉన్న రోడ్లు నేడు అద్దంలా మెరుస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తుని: తుని మున్సిపాలిటీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తోంది. ఎన్నికల సమయంలో అది చేస్తాం..ఇది చేస్తాం అన్ని చెప్పిన గత పాలకులు అధికారంలోకి వచ్చాక తాము చేసిన హామీలను మరిచి సొంత ప్రయోజనాలకు పెద్ద పీట వేశారు. ఇందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పాలకులు పట్టణంలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపారు. పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

మంత్రి రాజా సహకారంతో...

తుని ఎమ్మెల్యే, రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తుని పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో నాలుగున్నర ఏళ్లలో 100 సీసీ రోడ్లను రూ.11.50 కోట్లతో నిర్మించి చరిత్ర సృష్టించారు. ఇంత అభివృద్ధి గతంలోని ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదు. ప్రతి పక్షాలు రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు.

గత నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తుని పట్టణంలో 100 సీసీ రోడ్లను రూ.11.50 కోట్లతో నిర్మించారు. దీర్ఘకాలిక సమస్యలను సైతం పరిష్కరించడంతో ప్రజల ఆనందానికి అవధులేవు.



నాడు: గత ప్రభుత్వంలో అధ్వానంగా ఉన్న డీమార్ట్ రోడ్డు (ఫైల్)



నేడు: అద్దంలా ఉన్న డీమార్ట్ రోడ్డు

వార్డుల వారీగా అభివృద్ధి చేసిన రోడ్ల వివరాలు

- 1వ వార్డులో నెహ్రూనగర్, డ్రైవర్స్ కాలనీ కొండ ప్రాంతంలో రూ.70 లక్షలతో 15 రోడ్లను నిర్మించారు.
- 2వ వార్డులో డీమార్ట్ నుంచి తాళ్లూరు రైల్వే గేటు, రైల్వే గోడ, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో రూ.65 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు.
- 3వ వార్డులో గడిపే వారి వీధి, వీవర్స్ కాలనీలో రూ.17 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు.
- 5వ వార్డులోని సత్యసాయి వీధిలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
- 6వ వార్డులో సీతారామయ్యగారి వీధి, సమ్మెంగి వారి వీధి, కిల్లాడవారి వీధిలో రూ.23 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు.
- 7వ వార్డులో హిందూ శ్మశానవాటికకు రూ.13 లక్షలతో రోడ్డు ఏర్పాటు చేశారు.
- 8వ వార్డులో రూ.40 లక్షలతో మెయిన్ రోడ్డును అభివృద్ధి చేశారు.
- 9వ వార్డులో టీబీ బంగ్లా రోడ్డును రూ.18 లక్షలతో నిర్మించారు.
- 11వ వార్డులో శాంతినగర్, మారుతీ లాడ్జీ పక్కన రూ.24 లక్షలతో సీసీ రోడ్డు వేశారు.
- 13వ వార్డులో ఫీడర్ రోడ్డు, నారాయణరాజు గారి వీధి, గరువువీధి, ఆంధ్రరత్న రోడ్డు, తేనేవారి వీధి, గడ్డి మార్కెట్ ప్రాంతాల్లో రూ.కోటితో సీసీ రోడ్ల నిర్మాణం.
- 17, 18 వార్డుల్లో రూ.18 లక్షలతో బాలాజీ రోడ్డు వేశారు.
- 19, 21 వార్డుల్లో ముక్తిలింగం గారి వీధి, వడ్ల బంగారమ్మ, నూకాలమ్మ గుడి ప్రాంతాల్లో రూ.25 లక్షలతొ రోడ్ల నిర్మాణం.
- 20, 22 వార్డుల్లో ఇసుకలపేట నుంచి ఉప్పరగూడెం వరకు రూ.1.20 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం.
- రామకృష్ణా కాలనీలో రూ.కోటి వ్యయంతో 12 సీసీ రోడ్లు, 30వ వార్డు సాయినగర్, గణపతినగర్ ప్రాతాల్లో రూ.కోటి వ్యయంతో రోడ్లను నిర్మిస్తున్నారు.
- 28, 29 వార్డుల్లోనూ పలు రోడ్ల నిర్మాణం జరుగుతోంది.

పారదర్శకంగా అభివృద్ధి



పట్టణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి దాడిశెట్టి రాజా, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సహకారంతో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ప్రభుత్వ నిధులతో పాటు మున్సిపల్ నిధులను అభివృద్ధి కోసం వెచ్చించాం. పట్టణంలోని 30 వార్డులకు సమాన న్యాయం చేశాం. నాలుగున్నరేళ్లలో మున్సిపాలిటీ రూ.11.50 కోట్లు ఖర్చు చేయడం చరిత్ర.

– టీజేఎస్ ప్రసాదరాజు, కమిషనర్, తుని



నాడు: 6వ వార్డులోని సమ్మంగి వారి వీధిలో రోడ్డు దుస్థితి



నేడు: సమ్మంగి వారి వీధిలో వేసిన సీసీ రోడ్డు



నాడు: తుని పట్టణం వైఎస్సార్ కాలనీలో గ్రావెల్ రోడ్డు



నేడు: వైఎస్సార్ కాలనీలో సీసీ రోడ్డు

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



వెండి కలశాల్లో పంచామృతాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శనివారం నుంచి జరగనున్న ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. 108 వెండి కలశాల్లో పంచామృతాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కలశాలలో పంచామృతాలతో స్వామివారికి అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం, ఎన్ఎస్‌వీ నగరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎంపీడీఓ పి.రవికుమార్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన సంకల్ప యాత్రలు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రత్యేక వాహనం ద్వారా పాఠశాలల విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులకు ప్రభుత్వ పథకాలపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైస్సార్ సీపీ నాయకుడు కుసనం దొరబాబు, బీజేపీ నాయకుడు ప్రగడ చక్రరావు, నాగం బాబు, అధికారులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాలకూ మేలు చేకూరిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత తోట నరసింహం అన్నారు. స్థానిక సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధికి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో సహకరించారన్నారు. వైఎస్సార్‌తో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో తన హయంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, గుల్లా ఏడుకొండలు, గఫూర్, పరిమి వెంకటేశ్వరరావు, ఒబిణ్ని సత్యనారాయణ, దాసరి చినబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మురళీకృష్ణ



కొయ్యా మురళీకృష్ణ



మడదా హేమంత్

తొండంగి: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట కార్యదర్శిగా మండలంలోని ఏవీ నగరం గ్రామానికి చెందిన కొయ్యా మురళీ కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి నియామక ఉత్తర్వులు అందినట్టు శుక్రవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు అంగుళూరి సుశీల, దడాల విజయ్ తదితరులు కొయ్యా మురళీకి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా హేమంత్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా దానవాయిపేటకు చెందిన మడదా హేమంత్ నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. పలువురు పార్టీ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలి

గండేపల్లి: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓలు కేహెచ్ నాయక్, వెంకటరెడ్డి, ఎంపీడీఓ రామన్ పేర్కొన్నారు.మండలంలోని మల్లేపల్లి భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ద్వారా అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బలిరెడ్డి గంగరాజు, హెచ్ఎంలు వీఎస్ భాస్కరరావు, శ్యామలా కుమారి, లక్ష్మీదేవి, ఐఈఆర్‌టీఎస్ ప్రకాష్, సీఆర్‌పీఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాల పంపిణీ

ప్రత్తిపాడు: దీర్ఘకాలిక భూ సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు అన్నారు. మండలంలోని పెదశంకర్లపూడి, పోతులూరు గ్రామాల్లో కొండపోడును సాగు చేసుకుంటున్న లబ్ధిదారులకు శుక్రవారం ఆయన పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, గిరిజనులు దశాబ్దాలుగా కొండపోడును సాగు చేసుకుంటున్నా నేటికీ పట్టాలు మంజూరు కాలేదన్నారు. లబ్ధిదారులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టాలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కొండపోడు భూములను సాగు చేసుకుంటున్న 63 మందికి పట్టాలు పంపిణీ చేసినట్టు తహసీల్దార్ వీవీవీ గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచులు బొండి రాంబాబు, రొంగల నాగేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ నాగులాపల్లి రాంబాబు, ఉప సర్పంచ్ బర్ల చక్రం పాల్గొన్నారు.



పోతులూరులో కొండ పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

స్ఫూర్తిప్రదాత వల్లభాయ్‌పటేల్

ఏలేశ్వరం: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అందరికీ ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలో శుక్రవారం వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక కోనేటిబడి సమీపంలోని వల్లభాయ్ పటేల్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థినులు

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు

ప్రత్తిపాడు: స్వాతంత్ర్య సమర యోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ కె.కాశీవిశ్వనాథం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి తహసీల్దార్ వీవీవీ గోపాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.

క్రిస్టియన్ మైనార్టీ జోనల్ ఇంచార్జిగా జాన్ వెస్లీ



జగ్గంపేట: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ కాకినాడ జోనల్ ఇంచార్జిగా జగ్గంపేటకు చెందిన జాన్ వెస్లీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయని శుక్రవారం జాన్‌వెస్లీ తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జగ్గంపేట మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్‌గా జాన్‌వెస్లీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మొత్తం 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

కనకదుర్గమ్మ ప్రచార రథానికి ఘన స్వాగతం

గోకవరం: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయ ప్రచార రథం శుక్రవారం గోకవరంలో సందడి చేసింది. ధర్మ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గ్రామానికి చేరుకున్న ఈ రథానికి గ్రామ శివారు నుంచి దేవీచౌక్ ఆలయం వరకూ దేవీచౌక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఘన స్వాగతం పలికారు. జై భవానీ అంటూ నినాదాలు చేస్తూ బిందెలతో రోడ్లపై పసుపు నీళ్లు చల్లి రథాన్ని స్వాగతించారు. ఈ సదర్భంగా నిర్వహించిన చిన్నారుల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం దేవీచౌక్ ఆలయం వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు, చండీ హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవీచౌక్ ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రచారరథంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



తేటగుంటలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు

శంఖవరం: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే...(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండాను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌతు నాగు, ఎంపీటీసీ చల్లా సత్యప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతు అర్జుబాబు, అడపా సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలుద్దాం

ప్రత్తిపాడు: అవినీతి రహిత పాలన సాగిస్తూ, రాష్ట్రంలో సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలుద్దామని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి తెలిపారు. కిర్లంపూడి మండలం వీరవరంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల చెంతకే చేరవేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తొలుత సచివాలయంలో డిస్ ప్లే బోర్డును, పార్టీ పతాకాన్ని ఎంపీపీ తోట రవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు తోట గాంధీ, కొల్లు కృష్ణ, సచివాలయ కన్వీనర్ సానా మరిడిబాబు (సిద్దు) తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగన్ సీఎం కావాలి

తుని రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని తేటగుంటలో శుక్రవారం సర్పంచ్ అత్తి నాగరాజు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పేరూరి బద్రినారాయణ, పార్టీ అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, ఉపసర్పంచ్ పోతుల పెదకాపు, నాయకులు గణేసుల వీరబాబు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



కత్తిపూడిలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

రౌతులపూడి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.సాయి అన్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, పార్టీ నాయకుడు నరహరశెట్టి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన

గోకవరం: మండలంలో ఈ నెల 18 నుంచి జరిగే రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్లు తిరన్, నిఖిత కోరారు. మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ పథకం, జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు మూర్తి, శంకర్, హెచ్‌వీలు అరుణోనమ్మ, రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తిరన్

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కోటనందూరు: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని సైంటిస్టులుగా ఎదగాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం ఎస్. వేణుగోపాల్ ఆధ్వర్యంలో మండలస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఎంపీపీ లగుడు శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు ప్రారంభించారు. మండలంలోని ఆరు ఉన్నత, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొని అనేక అంశాలపై చక్కటి ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉన్న పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కొరుప్రోలు కృష్ణ, దొడ్డి బాబ్జీ, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, ఎంపీడీఓ సబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.



కోటనందూరులో విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న నాయకులు